# తప్పెవరిది?

చేకాల సుబ్రహ్మణ్యం



**రాజయ్యా!** నీ కొడుకు ఉత్తరం రాశాడు.''

పొలం పని చూసు కొంటున్న రాజయ్య తలెత్తి చూశాడు. ఎదురుగా పోస్ట్‌మాన్. టైమ్ మూడవుతున్నా, ఎండ ఇంకా తీక్షణంగానే ఉంది. నడుం మీద గుడ్డ తప్పించి రాజయ్య ఒంటి మీద మరే ఆచ్ఛాదన లేదు. నల్లటి ఒంటి మీద స్వేద బిందువులు సూర్య కిరణాలకు వింతగ మెరుస్తున్నాయ్.

నుదుట పట్టిన చెమట తుడుచు కొంటూ రాజయ్య వీరాజు దగ్గర కొచ్చాడు.

"ఆ ఉత్తరం ముక్కేదో నువ్వే చదివివినిపించు, బాబూ!''

వీరాజు ఆ వూరు వచ్చి పన్నెండు సంవత్సరా లవు తున్నది. ఈ పన్నెం డేళ్ళలో రాజయ్యకు ఏ పది సార్లో ఉత్తరాలు వచ్చుంటాయి. అన్నీ వీరాజే చదివి వినిపిస్తుంటాడు.

కాని, ఇంతకు ముందు వచ్చిన ఉత్త రాలు వేరు, ఇది వేరు. ఆ విషయం తన నోటితో ఎలా చెప్పాలా అని మథన పడుతున్నా డతను.

"ఏటి, బాబూ, మాటాడకండా గమ్మునుంటావ్. . ! అదేదో తొరగ సెప్పు. అసలాగ శానా పనుండాది.''

రాజయ్య మొహంలోకి చూశాడు వీరాజు.

ఏభై ఏళ్ళ వయసుంటుంది రాజయ్యకు. పసితనం నుండి కాయ కష్టం చేసుండటం వల్ల శరీరమింకా దృఢంగానే ఉంది. నుదుటి మీద మాత్రం వయసు తాలుకు ముడతలు కనపడు తున్నాయి.

ఎంత బాధ పడ్డా చెప్పక తప్పదు

"నీ మనుమడికి బాగా జబ్బుగా ఉందట. ఇంకెన్నో రోజులు బ్రతకడని డాక్టర్లు చెప్పారట—వెంటనే రమ్మని రాశాడు.'' నెమ్మదిగా ఉత్తరంలో సారాంశం చెప్పాడు వీరాజు.

వీరాజు చివరి మాటలు వినపడ లేదు రాజయ్యకు.

"ఇంకెన్నో రోజులు బ్రతకడని డాక్టర్లు చెప్పారట. .'' అదే రాజయ్యకు వినపడు తున్నది పదేపదే.

నమ్మబుద్ధి కాలేదు రాజయ్యకు,. జపాన్ బొమ్మలా, గాజులా మెరిసి పోతుండే చిన్నిగాడికి జబ్బేమిటి

రాజయ్యకు వెల్లువలా దుఃఖం పొంగు కొచ్చింది. ఎంత ప్రయత్నిం చినా కన్నీళ్ళు ఆగలేదు.

"అవునుమరి! అతని వంశాం కురం అంతరించి పోతున్నది. . ! !

రాజయ్యకు చిన్నిగాడంటే పంచ ప్రాణాలు. ఆ చిన్నిగాడు ఇంకెంతో కాలం బ్రతకడంటే అతని హృదయం తల్లడిల్లి పోయింది.

రాజయ్యకు ఒక్కడే కొడుకు. అతి కష్టం మీద టెన్త్ క్లాస్ వరకూ చదివించాడు. తనలాగే కొడుకు గూడా రాత్రనక, పగలనక శ్రమించ గూడదని రాజయ్య కోరిక. చదువైపోగానే, భూషయ్యగారి పుణ్యమా అని ఆఫీస్ ప్యూన్‌గా ఉద్యోగం వేయించాడు. ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్ళి చేయడం, రెణ్ణెల్ల తిరక్కుండానే రాజయ్య భార్య మరణించడం, తర వాత సంవత్సరానికి కోడలు ప్రసవిం చడం జరిగి పోయింది. సిజేరిన్ ఆప రేషన్ అవడం వల్ల మరో కాన్పు జరిగితే తల్లి ప్రాణానికి ముప్పని డాక్టర్ చెప్పారు. రాజయ్య కొడుకు వెంటనే వాసక్టమీ చేయించు కున్నాడు.

రెండేళ్ళ క్రితం కొడుకు దగ్గరకు వెళ్ళడం తప్ప రాజయ్య మళ్ళీ ఆ పూరు వెళ్ళనేలేదు. ఈ మధ్యలో కొడుకే నాల్గు సార్లు కోడల్నీ, చిన్నిగాడిని వెంటబెట్టు కొచ్చాడు.

దుఃఖాన్ని బలవంతంగా దిగమింగు కున్నాడు రాజయ్య. తను వెంటనే వెళ్ళాలి. . కనీసం చివరి చూపులైనా దక్కించు కోవాలి.

కానీ వెళ్ళాలంటే రెండు రూపా యలైనా ఉండాలే బస్సు చార్జీకి.. తన దగ్గ రొక్క పైసాగూడా లేదు.

• •

"బాబూ . . !''

చేతులు నలుపుకుంటూ నసుగు తున్న రాజయ్యను చూశాడు భూషయ్య.

"ఏం కావాలిరా?'' ఆ తరగతి మనుషులు చేతులు నలుపు కుంటున్నా రంటే ఏదో అవసరముండేనని భూషయ్యకు తెలుసు.

"ఒక్క రెండు రూపాయ లిప్పిం చండి, బాబూ!'' అన్నాడు రాజయ్య కొద్దిగా వంగి.

"ఓరి సన్నాసీ. . ! రెండు రూపా యల భాగ్యానికే నసుగుడెందుకురా?'' భూషయ్య జేబులో నుండి రెండు రూపాయల నోటు తీసిచ్చాడు.

ఆ మాత్రానికే రాజయ్య కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయ్.

నోటు అందుకుంటుండగా—

"ఎందుకురా రెండు రూపాయలు?'' యాదాలాపంగా అడిగాడు భూషయ్య.

విషయమంతా వివరించి చెప్పేంటే రాజయ్య కంఠం బొంగురు పోయింది.

డాక్టర్లు చెప్పారంటే అది నిజమే.


"రెండు రూపాయలేం సరిపోతా యిరా. . ఇదుగో. . ఈ ప[illegible] కూడా ఉంచు.'' భూషయ్య జేబులోంచి పది రూపాయల నోటు తీశాడు.

"ఒద్దు, బాబూ! ఇప్పటికే తమ కెంతో ఋణ పడున్నాను.'' సున్నితంగా తిరస్కరించాడు రాజయ్య.

అవసరాన్ని మించి ఒక్క పైసా గూడా రాజయ్య తన దగ్గర తీసు కోడు. అది మొదట్నుంచి అలవాటే. అందుకే భూషయ్య బలవంతం చేయ లేదు.

కానీ రాజయ్య ఆలోచన వేరు. రెండు రూపాయలుంటే కొడుకు దగ్గర కెళ్ళొచ్చు. భూషయ్య బాబు ఇప్పటికే తనకెంతో సహాయ పడ్డాడు. తన ఒంట్లో గూడా శక్తి తగ్గింది. పనేమీ చెయ్యకుండా భూషయ్య బాబు సహాయం తను పొందలేడు. చిన్నిగాడు బ్రతికున్నన్ని రోజులు అక్కడుండి, తరు వాత భూషయ్యబాబుకు చెప్పి శాశ్వ తంగా కొడుకు దగ్గర కెళ్ళిపోవాలి. కొడుక్కూడా రమ్మని బలవంతం చేస్తు న్నాడు.

రెక్కలు ముక్కలు చేసుకొని గొప్పింటి ఖజనాలు నింపుతున్నారే— రాజయ్య లాంటి వాళ్ళకు తింటానికి తిండి, కట్టుకోడానికి బట్ట, ఉండ టాని కొంప ఉంటే చాలు. అవసరానికి మించిన డబ్బుంటే ఏం చేసుకోవాలో అతని పరిధిలో ఉన్న వాళ్ళకు తెలి యదు. భూషయ్య వల్ల అప్పటికే ఎంతో సహాయం పొందానన్న అభిమానం రాజయ్యకు ఉండవచ్చు. తను పడ్డ కష్టం ముందు ఆ సహాయం ఏపాటిదో రాజయ్యకు తెలియదు. ఒక విధంగా, ఆత్మాభిమానమున్న పేదవాడు దరిద్ర నారాయణ సామ్రాజ్యానికి చక్రవర్తవు తాడేమో. .!



"త్వరగా ఎక్కవయ్యా!" విసుగ్గా అంటూ రాజయ్య చేతిలో రెండు రూపాయలనోటు గుంజు కున్నాడు కండక్టర్.

రాజయ్య ఎక్కగానే బస్సు కదిలింది.

"ఎక్కడికో చెప్పి తగులడు!" కండక్టర్ విసుగెందుకో రాజయ్య కర్థం కాలేదు. రాజయ్యకే కాదు. ఆ విసుగెందుకో ఎవరికీ అర్థంగాదు. అసలా కండక్టర్‌కే తెలీదు తన విసుగుకు కారణం!

"సెంటరు కొక టిక్కె టియ్యి, బాబూ!" రాజయ్య బెరుగ్గా అన్నాడు.

"ఒకటి కాకపోతే రెండిస్తాననుకున్నావా?" రాజయ్యతో హేళనగా అని,

"ఈ ముసలాళ్ళతో ఇదే బాధ, సార్! బాదస్తం ఎక్కువ పని తెమల నివ్వరు." పక్కనే కూర్చున్న యువకుడితో అన్నాడు కండక్టర్.

కానీ ఆ యువకుడు గమనిస్తున్నది కాదు. రాజయ్య ఎక్కిన చోటి నుండి సెంటరుకు చార్జీ రూపాయ ముప్పై ఐదు పైసలు. అరవై ఐదు పైసలకు బదులు అర్థ రూపాయి బిళ్ళ మాత్రమే రాజయ్య చేతిలో పెట్టాడు కండక్టర్.

దేశం ఎంత ప్రగతిని సాధించిందో చూస్తూ నవ్వుకున్నా డా యువకుడు. తను గట్టిగా పట్టు పట్టి మిగిలిన పదిహేను పైసలూ ఇప్పించ గలడు. కానీ, చేయడు! ఈ ఒక్కడినీ పట్టుకోవ డం వల్ల తను సాధించే దేమిటి?

అదే ఆ యువకుడు చేసిన తప్పు. ఆ పదిహేను పైసం కున్న విలువ తెలిస్తే అలా చేసేవాడు కాదేమో. ఎవరికి వారే తమ కెందుకని వూరుకుంటే ఈ దోపిడీ కొక హద్దంటూ ఉండదు.

కండక్టర్‌కు తనెంత ఇచ్చాడో, అతనెంత తిరిగిచ్చాడో చూసుకునే స్థితిలో రాజయ్య లేడు. అతనికి తెలిసిదల్లా ఒక్కటే.

తన దగ్గ రింకో అర్థ రూపాయుంది. తనకు బాగా గుర్తు. రెండేళ్ళ క్రితం సెంటర్ నుండి పాలానికి నలభై పైస లిచ్చాడు టిక్కెట్టుకు.

రాజయ్య కొడుకు పాలెంలో ఉంటున్నాడు.

"సెంటర్. సెంటర్" అన్న కండక్టరు కేకతో రాజయ్య ఉలిక్కి పడ్డాడు. సంచి చేతిలోకి తీసుకొని బస్సు దిగాడు. సంచిలో బాగా మాసి చిరిగి ఉన్న దోవతి, తుండు అతని పేదరికానికి నిదర్శనాలు.

ఉన్న బట్టనైనా శుభ్రంగా ఉంచు కోవాలన్న కనీసం జ్ఞానం లేని వాళ్ళు దేశంలో— దేశమనేది పెద్దమాటేమో— ఆ తరగతికి చెందిన వాళ్ళలో చాలా మందున్నారు.

• • •

"పాలేనికి బస్సు ఎన్నింటికి, బాబు గారూ?" రోడ్డు పక్కగా నిలుచున్న వృద్ధుణ్ణి అడిగాడు రాజయ్య.

"అరగంట క్రితమే రావలిసింది, ఇంకా రాలేదయ్యా!" ముసలాయన విసుగ్గా టైమ్ చూసుకుంటూ అన్నాడు.

"తమరుకూడా ఆ బస్సుకే ఎళ్ళాలా?"

"అవును. అది తప్పితే తెల్లారే వరకూ బస్సు లేదు. చ." స్వగతంగా అనుకున్నాడాయన.

రాజయ్యకు అంత దుఃఖం లోనూ ఒక్క క్షణం సంతోషం కలిగింది.

బస్ తన గురించే ఆలస్యమయ్యింటుంది. ఎప్పుడెప్పుడు చిన్నిగాణ్ణి వళ్ళోకి తీసుకుందామా అని తపించి పోతూందతని హృదయం.

పది గంటలకు రావలిసిన బస్సు పదకొండున్నర అయినా రాలేదు. అదుగో వస్తుంది. ఇదుగో వస్తుందంటూ చాలా సేపు ఎదురు చూశారు. నడిచి వెళ్ళినా బావుణ్ణు.

రాజయ్య అసహనంగా అటూ ఇటూ కదిలాడు. ఇక లాభం లేదనుకుంటూ అడుగు ముందుకు వేశాడు.

"ఎలాగూ ఇంత సేపున్నావ్. ఇంకో పదినిమిషాలుచూడకూడదూ?" రాజయ్య ఆలోచన గ్రహించిన వాడిలా ఆకాశం లోకి చూస్తూ అన్నాడు ముసలాయన.

సెంటర్ నుండి పాలేనికి ఎనిమిది కిలోమీటర్లు. చీకటి రాత్రు లవి. అక్కడక్కడ మిణుగురు పురుగులు మెరుస్తున్నాయి.

రాజయ్య కేం చేయాలో తోచక తికమకలో ఉండగానే రివ్వున వచ్చి ఆగింది బస్సు.

ఆ సమయంలో అక్క డున్నది ఇద్దరే. ఒకరు ముసలాయన, రెండవ వాడు రాజయ్య.

ముసలాయన ముందుగా బస్సు ఎక్కి, ఎక్కడకు వెళ్ళాలిసింది కండక్టర్‌కు చెప్పాడు రెండు రూపాయ లిస్తూ.

కండక్ట రిచ్చిన టిక్కెట్టు, చిల్లర చూసుకుని ఆశ్చర్య పోయా డాయన. అక్కడ నుండి తన వూరుకు రూపాయ అరవై పైసలు టిక్కెట్టు. ఆరు నెలలుగా ప్రతీ సారి తను రెండు రూపాయిలే ఇస్తున్నాడు కండక్టర్లకు కానిఇంతవరకూ ఎవరూ నలభై పైస లివ్వలేదు. ముప్పయ్యో, ముప్పై ఐదు పైసలో ఇస్తున్నారు.

కండక్టర్ చిన్నగా నవ్వాడు. "నా జీతం చాలు. సార్, నాకు" అంటూ— "ఎక్కడికి, తాతా?" అడిగాడు రాజయ్యను.

"పాళెం." కండక్టర్ చేతిలో అర్థ రూపాయి పెట్టాడు రాజయ్య.

"టిక్కెట్టు అరవై ఐదు పైసలు, తాతా! ఇంక పది హేనుపైస లివ్వు".

"లేవు, బాబూ! అయినా టిక్కెట్టు నలభై పైసలేగందా!" రెండేళ్ళ నాటి చార్జి రాజయ్య కింకా గుర్తే!

"లేకపోతే దిగు." రాజయ్యను దింపేసి, "రైట్" అన్నాడు కండక్టర్.

"ప్రజల సొమ్ము మా కొద్దు, సార్! అలాగే మా సొమ్ము ప్రజల కొద్దు." ముసలాయనతో నవ్వుతూ చెప్పాడు కండక్టరు.

బస్సులో మొత్తం మీద పది మంది దాకా ఉన్నారు.

రాజయ్యను దుమ్ము చుట్టేస్తుండగా దడదడ మంటూ బస్సు వెళ్ళిపోయింది. చార్జెస్ పెరిగాయని తెలీని రాజయ్య అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు. అతనికి వెంటనే కర్తవ్యం గుర్తు కొచ్చింది. క్షణంలో పాలెంవైపు వడివడిగా అడుగు లేయ సాగాడు.

చీకటిలో దారి సరిగ్గా కనపడటం లేదు.

పాలెం దగ్గర పడ్డది. దూరంగా దీపాలు కనపడు తున్నాయ్. వూరు మొదట్లోనే రాజయ్య కొడుకు ఉంటున్నది. నడక వేగం పెంచాడు రాజయ్య. అంత కంతకూ ఇంటికి దగ్గ రవుతున్నాడు.

అస్పష్టంగా ఆకారాలు. చాలా మంది ఉన్నారు. "అదేమిటి. అంత మంది ఉన్నారు?" ఒక వేళ చిన్నిగాడు. రాజయ్య ఆ పైన ఆలోచించ లేక పోయాడు. పరుగెత్త సాగాడు.

రెండే రెండడుగులు.

జనాన్ని పక్కకు నెట్టుతూ ఇంటి ముందు కొచ్చిన రాజయ్య నిశ్చేష్టుడై పోయాడు.

చిన్నిగాడు పోయాడు. తన దీపం, ఆశాజ్యోతి... ఆరిపోయింది.

తండ్రిని చూసి బావురు మన్నాడు రాజయ్య కొడుకు.

"చిన్నిగాడు వెళ్ళి పోయాడు, నాన్నా! మనందర్నీ వదిలే వెళ్ళి పోయాడు. పది నిమిషాలు ముందొచ్చినా చూసుకునే వాడివి, నాన్నా!" గుండె లవిసి పోయేలా ఏడుస్తున్నా డతను.

"పేణ మొగ్గేసే ముందు తాతా, తాతా అంటూ విలవిల్లాడి పోయాడు మామయ్యా! మువ్వో పది నిమిషాలు ముందొచ్చినా బతికే వాడేమో?" వెర్రిగా ఏడుస్తున్నది కోడలు.

రాజయ్య కివేమీ వినపడటం లేదు. భూషయ్యగారి చేతిలో పది రూపాయల నోటు కళ్ళ ముందాడు తున్నది.

తనెంత మూర్ఖంగా ప్రవర్తించాడు. ఆ పది నోటు తీసుకుంటే సమయానికి వచ్చేవాడే. తప్పంతా తనదే!

రాజయ్య అంతవరకే ఆలోచించ గలడు. ఆపైన ఆలోచించ లేడు.

కోరికల్ని గురించి ఎన్నడూ ఆలోచన రాలేదు.

విధి అనేక విధాల వక్రించి అతని చివరి కోరికను తోసి పుచ్చింది. మనుమడి కడచూపులకూడా నోచుకోనీలేదు.

ఆలోచించండి తప్పెవరిదో?!

అవసరాన్ని మించిన డబ్బు యజమాని దగ్గర తీసుకో కూడదనుకున్న రాజయ్యదా? అరవై ఐదు పైసలకు బదులు అర్థ రూపాయి ఇచ్చిన కండక్టర్‌దా?

కళ్ళ ముందు జరుగుతున్న దోపిడీ సరికట్ట లేని యువకుడిదా?

మరి కొంత సేపు బస్సు కోసం ఎదురు చూడమని ఉచిత సలహానిచ్చి ముసలాయనదా?

నీతి, నిజాయితీలకు మారుపేరైన కండక్టర్‌దా?

రోజు కో రకంగా చార్జెస్ మారుస్తున్న బస్సుల యాజమాన్యానిదా?

*